

## ప్రభాస్ ప్రేమకథా చిత్రమ్


గడిచిన కొన్నేళ్లల్లో ప్రభాస్ సరైన ప్రేమకథలో నటించలేదు. అన్ని యాక్షన్ తరహా చిత్రాలే. ఇప్పుడు ప్రేమకథకి ముహూర్తం కుదిరింది. జులై నుంచే ఆయన కొత్త ప్రేమాయణం మొదలు పెట్టనున్నారు. ప్రస్తుతం కల్కి 2898 ఎడి', 'సలార్ 2' 'రాజాసాబ్' చిత్రాలతోపాటు కన్నప్పలో అతిథి పాత్రలో కనిపించనున్నారు. వీటితోపాటు ఓ లవ్‌స్టోరీ చేయడానికి ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. హను రాఘవపూడి దర్శకత్వంలో.. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఈ సినిమాని నిర్మిస్తోంది. ఇప్పటికే స్క్రిప్ట్ పక్కాగా సిద్ధమైనట్టు సినీ తెలిసింది. ప్రేమ ప్రధానంగా సాగే పీరియాడిక్ యాక్షన్ కథతో ఈ చిత్రం ఉండబోతున్నట్టు సమాచారం. 'సీతారామం' తర్వాత హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. కథానాయిక ఎంపిక పక్రియ జరుగుతోంది. మరో పక్క మ్యూజిక్ సిట్టింగ్స్ కూడా జరుగుతున్నాయని సమాచారం.




### మహేశ్ బాబు మేనల్లుడు అశోక్ గల్లా

## దేవకీ నందన వాసుదేవ టైటిల్ ఖరారు

టాలీవుడ్ స్టార్ హీరో మహేశ్ బాబు మేనల్లుడు అశోక్ గల్లా హీరో సినిమా తర్వాత రెండో చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. దేవకీ నందన వాసుదేవ అనే టైటిల్‌తో ఈ సినిమా రానుండగా.. జాంబిరెడ్డి ఫేం ప్రశాంత్ వర్మఈ చిత్రానికి కథనందిస్తున్నాడు. గుణ 369 ఫేం అర్జున్ జంధ్యాలదర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమాలో అశోక్ గల్లా సరసన హీరోయిన్‌గా మాజీ మిస్ ఇండియా (2020) మానస వారణాసి నటిస్తుంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి మోషన్ పోస్టర్‌తో పాటు, టీజర్‌ను విడుదల చేయగా మంచి స్పందన లభించింది. ఇదిలావుంటే తాజాగా మూవీ నుంచి మ్యూజికల్ అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. నేడు అశోక్‌గల్లా పుట్టినరోజు.. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ.. ఫస్ట్ సింగిల్ ఏమయ్యిందే అనే రోమాంటిక్ మెలోడిని చిత్రయూనిట్ విడుదల చేసింది. 'ఏమయ్యిందే గుండెకు.. ఏనాడు లేదే ఇంత ఉలుకు.. నీ వల్లే కాదని అనకు.. ఏమయ్యిందో తెలిసే వరకు' అంటూ సాగిన ఈ ప్రేమ పాట సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. భీమ్స్ సిసిరోలియో కంపోజ్ చేసిన ఈ పాటకు సురేష్ గంగుల లిరిక్స్ అందించాడు. ఈశ్వర్ దత్ పాడాడు. ఇక త్వరలోనే షూటింగ్ పూర్తి చేసి రిలీజ్ డేట్‌ను అనౌన్స్ చేయనున్నారు.ఈ మూవీని నల్లపనేని యామిని సమర్పణలో లలితాంబికా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సోమినేని బాలకృష్ణ తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాకు సాయి మాధవ్ బుర్రా సంభాషణలు అందిస్తుండగా.. భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ చిత్రానికి ప్రసాద్ మూరెళ్ల సినిమాటోగ్రాఫర్ కాగా తమ్మిరాజు ఎడిటర్. కార్తికేయ హీరోగా అర్జున్ జంధ్యాల చివరగా డైరెక్ట్ చేసిన గుణ 369 బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచింది. ఈ సారి ఎలాగైనా మంచి హిట్టు కొట్టాలని చూస్తున్నాడు అర్జున్ జంధ్యాల.




## విజయ్ దేవరకొండ కొత్త సినిమా ప్రకటన

రాజావారు రాణిగారు సినిమాతో తెలుగు ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చాడు దర్శకుడు రవికిరణ్ కోలా. కిరణ్ అబ్బవరం హీరోగా, రహస్య గోరక్ హీరోయిన్‌గా 2019లో వచ్చిన ఈ చిత్రం మంచి విజయాన్ని నమోదు చేసింది. ఇక తన మొదటి సినిమాతోనే సక్సెస్ అందుకున్న కిరణ్, ఇప్పుడు వరుస అవకాశాలతో దూసుకుపోతున్నాడు. ఇదిలా ఉంటే ఈ సినిమా దర్శకుడు రవికిరణ్ కోలా తన కొత్త ప్రాజెక్ట్ అనౌన్స్ చేసిన విషయం తెలిసిందే. టాలీవుడ్ టాప్ ప్రోడక్షన్స్ సంస్థ అయిన శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ తన కొత్త ప్రాజెక్ట్‌ను రవికిరణ్ కోలాతో చేయబోతున్నట్లు గతేడాది సోషల్ మీడియాలో ప్రకటించింది. అయితే ఈ ప్రకటన వచ్చిన అనంతరం కొత్తగా ఎటువంటి అప్‌డేట్‌ను ఇవ్వలేదు. తాజాగా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి సాలిడ్ అప్‌డేట్‌ను పంచుకుంది. రవికిరణ్ కోలా దర్శకత్వంలో వచ్చే ఈ ప్రాజెక్ట్‌లో రౌడీ హీరో విజయ్ దేవరకొండ హీరోగా నటించబోతున్నాడు. రూరల్ యాక్షన్ డ్రామాగా రాబోతున్న ఈ మూవీకి సంబంధించి మరిన్ని వివరాలను మే 09న ప్రకటించబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ ప్రాజెక్ట్ సంబంధించి మరిన్ని అప్‌డేట్‌ల కోసం చూస్తూనే ఉండండి అంటూ శ్రీ వెంకటేశ్వర బ్యానర్ సోషల్ మీడియాలో రాసుకొచ్చింది.

